నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 9 నవంబర్ 2024 | VIKARABAD


రైతుల నుంచి పత్తిని కొంటున్న దళారులు

## పత్తి రైతుకు
# దక్కని ప్రతిఫలం

- పత్తి కొనుగోళ్లపై దృష్టి సారించని ప్రభుత్వం
- రంగారెడ్డి జిల్లాలో అందుబాటులోకి రాని కొనుగోలు కేంద్రాలు
- విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్న అన్నదాతలు
- పెట్టుబడి ఖర్చులూ తీరడంలేదని ఆవేదన

ప్రభుత్వం జిల్లాలో 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పినా..అవి సక్రమంగా పనిచేయడం లేదు. అందుబాటులో ఉన్న కేంద్రాలకు రైతులు పత్తిని తీసుకెళ్తే అక్కడి అధికారులు వివిధ కొర్రీలు పెడుతున్నారు. మధ్య దళారులు తీసుకొచ్చిన పత్తిని ముందుగా తీసుకుంటున్నారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధర వచ్చినా సరే అనుకుని దళారులకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనంగా ఉండడంతో దిగుబడులు బాగా వచ్చి పెట్టిన ఖర్చులు పోను ప్రతిఫలం దక్కుతుందని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతున్నది. పంట సాగు ఖర్చులూ తీరేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- రంగారెడ్డి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ)

జిల్లాలోని మాడ్గుల మండలం పత్తికి ఎంతో ప్రసిద్ధి. ఈ మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు సుమారు 5,250 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. ఈ సారి పంట ఆశాజనకంగా ఉండడంతో మంచి దిగుబడి వచ్చి పెట్టిన పెట్టుబడులు పోను కొంత మిగులుతుందని భావించారు. కానీ, ప్రభుత్వం రైతులపై సరైన దృష్టి సారించకపోవటంతో గిట్టుబాటు ధర లేక తెల్లమొహం వేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని యాచారం, మంచాల, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, షాద్‌నగర్, నందిగామ, ఫారుఖ్‌నగర్, చౌదర్‌గూడ తదితర మండలాల్లోనూ పత్తిని సాగు చేసిన రైతులు మద్దతు ధరకు విక్రయించుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారు.

### జిల్లాలో 1.39 లక్షల ఎకరాల్లో ..

ఈ సీజన్‌లో రైతులు 1.39 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, యాచారం, మంచాలతోపాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పత్తి పంటను అన్నదాతలు సాగు చేశారు. పంట చేతికొచ్చినా ఇంకా కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడంతో దానిని ఎక్కడ విక్రయించాలో తెలియక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ ఏర్పాటైన కేంద్రాల్లోకి పత్తిని తీసుకెళ్తే అక్కడి అధికారులు వివిధ కొర్రీలు పెడుతుండడంతో..విధిలేని పరిస్థితుల్లో అన్నదాతలు తక్కువ ధరకే మధ్యదళారులకు విక్రయిస్తున్నారు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.7,350 ప్రకటించగా.. దళారులు మాత్రం రూ.6,500-రూ.7,000 లోపే కొంటున్నారు. 8.12 శాతం తేమ ఉంటే రూ.7,350 మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా దళారులు రూ.7,000 దాటనివ్వడం లేదు. చింతపల్లిలోని పత్తిమిల్లులో ఒక్కో ట్రాక్టర్‌కు 50 కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లలోనూ పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

### చింతపల్లిలోని పత్తిమిల్లుకు..

ప్రభుత్వం జిల్లాలో సీసీఐ ద్వారా 15 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందులో షాద్‌నగర్ నియోజకవర్గంలో 11, ఆమనగల్లు పరిధిలో 3, చేవెళ్ల పరిధిలో ఒక్కటి ఉన్నాయి. 15 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించినా అవి ఎక్కడా సరిగ్గా పని చేయడంలేదు. ఆమనగల్లు పరిధిలో మూడు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడంతో మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన రైతులు తమ పంటను చింతపల్లి మండలంలోని పత్తిమిల్లుకు తీసుకెళ్తున్నారు.

### రైతులను పట్టించుకోవడం లేదు



సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు పత్తిని తీసుకెళ్తే అక్కడి వారు పట్టించుకోవడం లేదు. వివిధ కొర్రీలతో గంటల తరబడి ఉంచుతున్నారు. దళారులు తీసుకెళ్లిన పత్తినే ముందుగా తీసుకుంటున్నారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితిలో తక్కువ ధర వచ్చినా సరే అని దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన పత్తికి ప్రాధాన్యమివ్వాలి.

- ఆరోగ్యారెడ్డి, మాడ్గుల మండలం



## మద్యం కొంటారా..
# కేసులు పెట్టాలా..?

**మద్యం వ్యాపారులపై ఎక్సైజ్ అధికారుల ఒత్తిడి**

- ప్రతినెలా నిర్దేశించిన టార్గెట్ రీచ్ అయ్యేలా వేధింపులు
- మద్యం కొనకుంటే కేసులు పెడతామని బెదిరింపులు
- అధికారుల వేధింపులు భరించలేక అప్పులు తెచ్చి కొంటున్నామంటున్న వ్యాపారులు
- వికారాబాద్ జిల్లాలో ప్రతినెలా రూ.53 కోట్లకు పైగా అమ్మకాలు
- టార్గెట్ పూర్తికాకుంటే అధికారులకు మెమోలు..!

రేవంత్ సర్కార్ ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నది. ప్రతినెలా అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యేందుకు వ్యాపారులపై ఎక్సైజ్ పోలీసులతో ఒత్తిడి తీసుకొచ్చి మరీ మద్యం కొనేలా చేస్తున్నది. లిక్కర్ కొనకుంటే మీ షాపులపై కేసులు నమోదు చేస్తామని కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు భయపెట్టి మరీ మాతో మద్యాన్ని కొనేలా చేస్తున్నారని పలువురు మద్యం షాపుల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా టార్గెట్లు పూర్తి కాని సీఐ, ఎస్ఐలకు ఉన్నతాధికారులు మెమోలు జారీ చేస్తున్నట్లు సమాచారం. కాగా వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు, 7 బార్లు ఉన్నాయి. వాటి ద్వారా ప్రతి నెలా రూ. 53 కోట్ల నుంచి రూ.55 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి.

- పరిగి, నవంబర్ 8

వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు, 7 బార్లు ఉన్నాయి. వాటిలో ప్రతినెలా రూ. 53 కోట్ల నుంచి రూ.55 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. వివాహాల సీజన్, దసరా, సంక్రాంతి పండుగల సమయాల్లో మద్యం అమ్మకాలు మరింత అధికంగా ఉండడంతో సంబంధిత నెలల్లో సుమారు రూ.60 కోట్ల వరకు విక్రయాలు జరుగుతాయి. ఎంత ఎక్కువ మద్యం విక్రయిస్తే ప్రభుత్వానికి అంతగా ఆదాయం సమకూరుతుందని.. అందువల్ల అధికంగా మద్యాన్ని కొనుగోలు చేయాలని ఎక్సైజ్ అధికారుల నుంచి రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతున్నదని పలువురు లిక్కర్ షాపుల నిర్వాహకులు పేర్కొంటున్నారు. నెలల వారీగా లిక్కర్‌ను కొనాలని టార్గెట్లు విధించి మరీ మాతో మద్యాన్ని కొనుగోలు చేయిస్తున్నారని.. గతేడాది సంబంధిత నెలలో సదరు షాపులో విక్రయించిన మద్యం కంటే ఈసారి కనీసం 10 నుంచి 20 శాతం ఎక్కువగా విక్రయించాలని ఆదేశిస్తున్నారని వాపోయారు. అందుకోసం నెల ప్రారంభంలోనే ఒకసారి ఈ నెలలో ఇంత మొత్తంలో మద్యం కొనాలని, 20 తేదీ నుంచి ఈ ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతుందని.. మీరు ఉద్దెర ఇచ్చుకుంటారో..? ఏమి చేసుకుంటారో మాకు సంబంధం లేదు.. నిర్దేశించిన మేరకు మద్యాన్ని కొని డబ్బులు చెల్లించండంటూ స్థానిక ఎక్సైజ్ పోలీసుల నుంచి ఉన్నతాధికారుల వరకూ ప్రతిరోజూ ఫోన్లు చేసి వేధిస్తుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చెప్పినంత మద్యం కొంటారా..? లేక వివిధ కారణాలతో మీ షాపులపై కేసులు నమోదు చేయమంటారా..? అని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. గతేడాదికి పైగా రియల్ ఎస్టేట్ రంగం స్తబ్దుగా ఉండడంతో భూముల క్రయవిక్రయాలు తగ్గిపోయి వాటి ప్రభావం మద్యం అమ్మకాలపై పడిందని, తద్వారా కనీసం 2 నుంచి 3శాతానికి పైగా మద్యం అమ్మకాలు తగ్గాయని మద్యం షాపుల నిర్వాహకులు పేర్కొంటున్నారు. అధికారులు చెప్పనంత మేరకు మద్యాన్ని కొనాలంటే అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. గతంలో ఎన్ని కాటన్ల బీర్లు, ఎన్ని కేస్‌ల లిక్కర్ కొంటారని అడిగే వారని, ప్రస్తుతం ఎన్ని లక్షల విలువ చేసే మద్యం ఈ రోజు లిఫ్ట్ చేస్తారని అడుగుతున్నారన్నారు. 25 తేదీ నుంచి నెలాఖరు వరకు ప్రతిరోజూ ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి వరకు మద్యం కొనుగోలుపై ఒత్తిళ్లు మామూలుగా ఉండవని.. దీంతో చేసేదేమీ లేక అప్పులు తీసుకొచ్చి కొంటున్నామన్నారు. అమ్ముడు పోక మిగిలిన మద్యాన్ని గ్రామాల్లోని బెల్ట్ షాపులకు చేరవేస్తున్నామని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ వ్యాపారి పేర్కొన్నారు.



### గల్లీకో బెల్ట్ షాపు...

ఖజానా నింపుకొనేందుకు సర్కారు టార్గెట్‌లు పెట్టి మరీ మద్యాన్ని కొనుగోలు చేయిస్తుండడంతో ఆయా దుకాణాల వారు బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారు. తమకు తెలిసిన వారుంటే చాలు మీకు అవసరమైతే ఉద్దెర సైతం ఇస్తామని చెబుతుండడంతో ప్రతి గ్రామంలోనూ కనీసం నాలుగైదు బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. పెద్ద గ్రామాలైతే పది వరకు ఉండి.. ఎప్పుడంటే అప్పుడు మద్యం సులభంగా లభిస్తున్నది. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. తమ కాలనీలో బెల్ట్‌షాపు నడుస్తుందని ఎవరైనా చెప్పినా చర్యలు శూన్యం. ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపుల దగ్గరకు తనిఖీలకు వెళ్తే మద్యం దుకాణాల వారి నుంచి ఫోన్లు వెళ్తాయి. మద్యం కొనుగోళ్లపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో ఆ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.

### టార్గెట్ రీచ్ కాకుంటే మెమోలు..

మద్యం కొనుగోలుకు సంబంధించి వ్యాపారుల కంటే ఎక్సైజ్ శాఖలో పనిచేసే సీఐ, ఎస్ఐలకు అధికంగా టార్గెట్ పేరిట ఒత్తిళ్లున్నాయని సమాచారం. సంబంధిత నెలలో ఒక్కో మద్యం షాపు వారు కొనాల్సిన మద్యాన్ని కొన్నారా..? లేదా..? అని సీఐ, ఎస్ఐలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు ఫోన్లు చేసి ఆరా తీస్తుంటారు. నిర్దేశించిన మేరకు మద్యం కొనుగోళ్లు జరుగకపోతే ఆయా సీఐలు, ఎస్ఐలకు మెమోలు జారీ అవుతాయని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ అధికారి పేర్కొన్నారు. ఈ ఒత్తిళ్ల నుంచి బయట పడేందుకు ఒకరిద్దరు అధికారులు తమ సొంత డబ్బుతో వ్యాపారులతో మద్యాన్ని కొనుగోలు చేయించిన సందర్భాలూ ఉన్నాయన్నారు.

## బోనస్ ఎగ్గొట్టేందుకే..
# ధాన్యాన్ని కొనడం లేదు

**బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



రంగారెడ్డి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : వరికోతలు మొదలై ఇరవై రోజులు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండ్రోజుల కిందట ధాన్యం కొనుగోలు కేంద్రాలను మొక్కుబడిగా ప్రారంభించినా నేటికీ ఒక్క గింజనూ కొనలేదని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్‌మిల్లులను కేటాయించకపోవడంతో కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయన్నారు. రైస్‌మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీల లంకె పెట్టడంతో వారు ముందుకు రాక ధాన్యం కొనుగోళ్లు సావ్యంగా సాగడం లేదన్నారు. రూ.500 బోనస్ ఎగ్గొట్టేందుకే ధాన్యాన్ని కొనడం లేదని ఆరోపించారు. సోమవారంలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే రైతులతో కలిసి ఆ కేంద్రాలను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, పార్టీ మండలాల అధ్యక్షులు రాములు, రమేశ్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.

# అవినీతికి అందలం

## విద్యుత్ శాఖలో ఇష్టారాజ్యం

**కొత్త లేఅవుట్లలో అడ్డగోలుగా లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు**

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో అవినీతిని సమూలంగా అంతం చేయాలని ఎంత ప్రయత్నం చేసినా ఫలితం ఉండడం లేదు. శివారు ప్రాంతాల్లో కొత్తగా వెలుస్తున్న కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు అవసరమైన విద్యుత్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడంలో సెక్షన్‌స్థాయి అధికారులు, ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారు. విద్యుత్ శాఖలో అవినీతి మితిమీరిన స్థాయికి చేరిందని, దాన్ని అరికట్టేందుకు ఇటీవల టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పైగా ప్రతి సర్కిల్, డివిజన్, సెక్షన్ కార్యాలయంలోనూ ప్రత్యేకంగా స్టిక్కర్లు అంటించినా ప్రయోజనం లేకుండా పోతున్నది. విద్యుత్ శాఖలో ఇప్పటివరకు ఉన్నతాధికారులు మొదలుకొని.. కింది స్థాయి ఉద్యోగుల వరకు పదుల సంఖ్యలో ఏసీబీ అధికారులకు చిక్కినా.. కొందరు అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు.

### ఫుట్‌పాత్‌పై గేటెడ్ కమ్యూనిటీ ట్రాన్స్‌ఫార్మర్..

సాధారణంగా నగరంలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టులు, కార్యాలయాల భవనాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన బిల్డర్లే తమ ప్రాంగణంలోనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఇటీవల నగర శివారు ప్రాంతాల్లో ఓ గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేయడంతో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఫిర్యాదులు రావడంతో విద్యుత్ శాఖ అధికారులకు ఇష్టం లేకపోయినా ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాల్సి వచ్చింది. ఈ విషయంలో సంబంధిత గేటెడ్ కమ్యూనిటీ నిర్మించిన రియల్ ఎస్టేట్ సంస్థకు మేలు చేసేలా సెక్షన్ అధికారులు వ్యవహరించి, అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ఇలాంటి సంఘటనలు శివారు ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్నాయని, నిబంధనల ప్రకారం విద్యుత్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయకుండా, రియల్ ఎస్టేట్ బిల్డర్లకు అనుకూలంగా సిబ్బంది వ్యవహరిస్తూ రూ. లక్షలు దండుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అనుమతుల్లేని లేఅవుట్‌లలో..

జీహెచ్‌ఎంసీ పరిధిని మినహాయిస్తే శివారులోని మున్సిపాలిటీల్లో చాలావరకు జీపీ లేఅవుట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా జీపీ లేఅవుట్లలో ఇండ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో వాటి కోసం నిబంధనలకు పరిగణనలోకి తీసుకోకుండానే విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం ద్వారా సంస్థకు ఆదాయం వస్తుందని చెప్పి.. లే అవుట్‌లో ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. అనధికారికంగా చేసిన లేఅవుట్లలో చాలా చోట్ల రోడ్ల వెడల్పు 30 అడుగుల కంటే తక్కువగా ఉన్నా.. అదే రోడ్లపైనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తూ, విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. జీపీ లేఅవుట్‌లలో పార్కు స్థలాలు, సామాజిక అవసరాల కోసం కేటాయించిన 10 శాతం స్థలం మచ్చుకైనా కనిపించదు. ఇలాంటి చోట విద్యుత్ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## సీఎం ఇలాకాలో..
# మందులూ కరువే

**కొడంగల్ సర్కారు దవాఖానలో నిండుకున్న మందులు**

- వైద్యులు రాసిన చీటీలకు బయటి షాపుల్లో మందులు తెచ్చుకోవాలంటున్న ఫార్మసీ సిబ్బంది


కొడంగల్ దవాఖానలోని డాక్టర్ గది ఎదుట వేచి ఉన్న రోగులు

కొడంగల్, నవంబర్ 8 : సర్కారు దవాఖానలో మందుల్లేవని, వైద్యులు రాసిన చీటీలకు మందులను బయటే తీసుకోవాలని అక్కడి ఫార్మసీ సిబ్బంది సూచిస్తున్నారు. సీఎం ఇలాకాలో పరిస్థితి ఇలా దారుణంగా ఉండడంపై స్థానికులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో నూతన భవన నిర్మాణంతో కొడంగల్ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు సమకూరి, సీహెచ్‌సీ నుంచి వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రిగా రూపుదిద్దుకోవడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50 పడకలుగా ఉన్న దవాఖానను 220 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు టీచింగ్ ఆసుపత్రిగా మార్చారు. అయితే వైద్యుల సంఖ్య పెరిగి, మెరుగైన వైద్యం అందుతుందని భావించిన ప్రజలకు నిరాశ ఎదురవుతున్నది. దవాఖానకెళ్తే సరిగ్గా వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, అరకొరగా వైద్యం అందుతున్నదని.. మందుల కోసం వైద్యులు చీటీలు రాస్తే.. అక్కడి ఫార్మసీలో అందుబాటులో లేవని బయట ఉన్న మెడికల్ షాపుల్లో కొనుక్కోవాలని అక్కడి సిబ్బంది సూచిస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ దవాఖానలకు వెళ్లలేక సర్కారు దవాఖానకొస్తే ఇక్కడి వైద్యులు పట్టించుకోవడంలేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వైద్య సిబ్బందితో ప్రస్తావించగా.. దవాఖానలో మందుల కొరత లేదని, రోగులందరికీ మందులు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.


దవాఖానలోని ఫార్మసీలో మందుల్లేక పోవడంతో తిరిగి వెళ్తున్న స్థానికులు

### మందులను బయట కొనుక్కోమన్నారు..

నా కుమార్తెకు ఇటీవల తాండూరులోని ప్రభుత్వ దవాఖానలో డెలివరీ అయింది. మెడిసిన్ అయిపోవడంతో మళ్లీ అక్కడికెళ్లడం ఇష్టంలేక కొడంగల్‌లోని ప్రభుత్వ దవాఖానలోని వైద్యులకు చూపించా. డాక్టర్ పరీక్షించి కొన్ని మందులు రాశారు. ఆ ప్రిస్క్రిప్షన్ తీసుకుని ఫార్మసీకి వెళ్లగా అక్కడి సిబ్బంది మందుల్లేవని అంటున్నారు. డబ్బుల్లేకే కాదా..సర్కారు దవాఖానకొచ్చాం. మందులు కొనే వెసులుబాటు ఉంటే ప్రైవేట్‌కే వెళ్లేవాళ్లం.

- రేవతి, ఉడిమేశ్వరం, కొడంగల్ మండలం

## అక్కరకు రాని టాయిలెట్లకు
# లెక్కలేని బిల్లులు!

- ఏజెన్సీలతో అధికారుల మిలాఖత్
- ఒక్కో టాయిలెట్ పేరిట రూ.3,960 బిల్లు వసూలు..
- పట్టించుకోని జడ్సీలు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్లు పనికి రాకుండా పోతుండగా.. కొందరు అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నది. మూడేండ్ల పాటు టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలతో కొందరు అధికారులు మిలాఖత్ అయి.. రికార్డుల్లో నిర్వహణ భేష్ అంటూ బిల్లులు పెట్టేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం టాయిలెట్లకు తాళాలు వేయడం, కనీసం ఎందుకు పనికి రాకుండా ఉంటున్నాయి. నిర్వహణను గాలికి వదిలేసిన కొందరు.. బిల్లులు మాత్రం పెట్టేస్తుండడం గమనార్హం.

### 1857 పబ్లిక్ టాయిలెట్లు..

ఆరు జోన్లలో 4,826 సీట్లలో 1,857 పబ్లిక్ టాయిలెట్లు ఉండగా.. కూకట్‌పల్లి జోన్‌లో 403 టాయిలెట్లలో ఎక్కువ శాతం నిర్వహణ లేకుండా ఉన్నాయి. అయితే కొన్ని నెలలుగా టాయిలెట్ల నిర్వహణ సరిగ్గా లేకున్నా బిల్లులు డ్రా చేస్తున్నారన్న అభియోగాలు ఉన్నాయి. అధికారులు మాత్రం మార్చి నుంచి పేమెంట్లు జరగలేదని చెబుతున్నారు. వాస్తవంగా మూడేండ్ల పాటు ఏజెన్సీల నిర్వహణపై పర్యవేక్షణ చేసి అందుకు అనుగుణంగా బిల్లులు చెల్లించే బాధ్యత జీహెచ్‌ఎంసీది. మూడేండ్ల టెండర్ ఏజెన్సీకి ఇచ్చినప్పుడు వారితో పనిచేయించి బిల్లులు ఇవ్వాల్సిన చోట...ఈ ప్రక్రియలో నిర్వహణ లేని ఒక్కో టాయిలెట్‌కు రూ.3,960ల చొప్పున కాంటిజెంట్ బిల్లు పెడుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఒక్క కూకట్‌పల్లిని పరిశీలిస్తే..

కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన టాయిలెట్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు మురుగు కూపాలుగా, అధ్వాన స్థితిలో ఉన్నాయి. 2023 మార్చిలో కూకట్‌పల్లి జోన్ పరిధిలో 403 టాయిలెట్లకు టెండర్ వేశారు. టెండర్ వచ్చిన ఏజెన్సీలు మూడేండ్ల (2026) వరకు వాటి నిర్వహణ బాధ్యతను చేపట్టాలి. టెండర్‌లో ఐదు ఏజెన్సీలకు కాంట్రాక్ట్ దక్కింది. ఇందులో ప్యాకేజీ-1 స్ట్రాటోస్, ప్యాకేజీ-2 ఎస్‌డీ ఫెసిలిటీ సర్వీస్, ప్యాకేజీ-3 గోపీ సురేంద్రకుమార్, ప్యాకేజీ-4 సఫాయి కర్మచారి కాంగార్ సొసైటీ, ప్యాకేజీ-5 శ్రీ దుర్గా భవాని ఎంటర్ ప్రైజెస్‌కు కేటాయించారు. టెండర్ సమయంలో జోనల్ కమిషనర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, సీటీవో, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో టెండర్లను ఇచ్చారు. వీటి నిర్వహణ సరిగా అయిందా లేదా అనేది అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ పరిశీలించి రిపోర్టు పంపాలి. రిపోర్టులో అన్ని సరిగ్గా ఉంటేనే బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ నిర్వహణలో లేని వాటికి సైతం బిల్లులు పెడుతున్నట్లు తెలిసింది.

### నీళ్లు ఉంటలే.. క్లీన్‌చేస్తలే..

టాయిలెట్లు క్షేత్రస్థాయిలో లేకున్నా వాటి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నట్లు, ఇందులో కొన్ని ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 7,400 టాయిలెట్లు నిర్మించగా సగానికి పైగా వినియోగంలో లేవని, కొన్ని చోట్ల గాయబ్ అయ్యాయని, బిల్లుల చెల్లింపులు మాత్రం యథావిధిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల నల్లాలు, డోర్లు, ఇతర సామగ్రి చోరీకి గురికావడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే వారికి 'అర్జెంట్' అయితే ఎక్కడికి వెళ్లాలో అర్థం కానీ పరిస్థితి . తిరిగి పే అండ్ యూజ్ టాయిలెట్లకు వెళ్లక తప్పడం లేదు. ఆర్టీసీ బస్టాప్‌లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్లలో చాలావరకు ప్రస్తుతం కనిపించడం లేదు. వాస్తవానికి కమర్షియల్ ఏరియాల్లో ఉండే టాయిలెట్లను రోజుకు నాలుగు సార్లు, నాన్ కమర్షియల్ రోజుకు కనీసం మూడు సార్లు క్లీన్ చేయాల్సి ఉన్నది. డైలీ క్లీనింగ్ చేస్తున్నారా? అంటే లేదనే స్థానికులు చెబుతున్నారు. కొన్ని టాయిలెట్లకు కనీసం డోర్లు కూడా లేవని, వీటికి తోడు మరుగుదొడ్లలో నీళ్లు కూడా అందుబాటులో ఉండడం లేదని పేర్కొంటున్నారు. దీంతో విధిలేక చాలా మంది 'పే అండ్ యూజ్', బస్టాప్‌ల వద్ద ఉండే సులభ్ కాంప్లెక్స్‌లను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

